సంపుటి : 01
సంచిక : 323

# ఎలగందల్ టైమ్స్

ప్రతి అక్షరం ప్రజల కోసం..

www.elagandaltimes.com

తెలుగు దినపత్రిక | కరీంనగర్ | సోమవారం 11 మార్చి 2024 | పేజీలు 6

## బుర్ర అంజనేయులు గౌడ్ కుటుంబానికి మంత్రి పొన్నం పరామర్శ



ఎలిగేడు మండల కేంద్రానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ బుర్ర ఆంజనేయులు గౌడ్ తండ్రి ప్రముఖ సిపిఐ రాష్ట్ర నాయకులు బుర్ర కొండయ్య గౌడ్ ఇటీవల మరణించారు.మంత్రి పొన్నం ప్రభాకర్  వెలేడు లోని వారి స్వగృహానికి వెళ్లి బుర్ర కొండయ్య చిత్ర పటానికి నివాళులర్పించారు..అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి  ధైర్యం చెప్పారు..

ఇంటికి వచ్చే అల్లునికి పడుకునేందుకు జాగ లేదంటూ ఇందిరమ్మ ఇళ్ళను హేళన చేస్తూ ప్రతీ నిరుపేదకు తమ ప్రభుత్వం డబుల్ బెడ్ రూం ఇళ్ళను ఉచితంగా కట్టి ఇస్తుందని వరాల జల్లు కురిపించి అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ పదేళ్ళలో పదిశాతం కూడా పంపిణీ చేయలేక చేతులెత్తేసింది. ఈ పరిస్థితుల్లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఆ పథకాన్ని రద్దు చేసి తిరిగి గతంలో మాదిరిగా ఇందిరమ్మ ఇళ్ళ పథకానికి శ్రీకారం చుడతోంది. సోమవారం సీఎం రేవంత్ రెడ్డి ఈ పథకాన్ని కొత్తగూడెం సభలో ప్రారంభించనున్న నేపథ్యంలో నిరుపేద, మధ్య తరగతి వర్గాల్లో తిరిగి ఆశలు చిగురిస్తున్నాయి. అయితే ఈ పథకం కూడా కాగితాలకే పరిమితమవుతుందా... ఇచ్చిన హామీ నెరవేరుతుందా అన్నదానిపై ఇప్పుడు ప్రజల్లో ఉత్కంఠ నెలకొన్నది.




2లో

# ఇందిరమ్మ ఇళ్లపైనే ఆశలు..

- స్వంత ఇంటిపై ఆశలు...
- డబుల్ బెడ్ స్కీం రద్దు...
- ఇందిరమ్మ ఇళ్ళ పథకానికి శ్రీకారం..
- నేడు ప్రారంభించనున్న సీఎం రేవంత్ రెడ్డి...

- నెలలోనే రెండోసారి రిజర్వాయర్ కు సాగునీరు
- పరవళ్ళు తొక్కుతున్న నారాయణపూర్
- రైతుల్లో హర్షా తిరేకాలు

2లో



# భగీరథుడయ్యాడు..

యువ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చొరవ పట్ల చొప్పదండి నియోజకవర్గ ప్రజల్లో హర్షం వ్యక్తమవుతోంది. గత ప్రజాప్రతినిధులకు భిన్నంగా ప్రజలకు సేవ చేయడమే లక్ష్యంగా పెట్టుకొని ఎవరికీ ఏ అవసరం వచ్చినా అండగా ఉంటూ వస్తున్న సత్యం తాజాగా రైతాంగానికి అండగా నిలిచిన తీరు ప్రశంసలనందుకుంటున్నది.  నెలరోజుల వ్యవధిలోనే ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి నారాయణపూర్ రిజర్వాయర్ కు రెండవసారి నీటిని విడుదల చేసేలా చూడటంతో రైతులు సంబరపడిపోతున్నారు.

2లో



## కళకు వన్నె తెచ్చిన అల్ఫోర్స్ మౌక్తికం

- ముఖ్య అతిథిగా హాజరైన పద్మశ్రీ మల్లేషం
- స్ఫూర్తిదాయక ప్రసంగం చేసిన నరేందర్ రెడ్డి

## కుల గౌరవాన్ని కాపాడుతా

- బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్
- పొన్నంకు ఘనంగా గౌడ సంఘాల ఆత్మీయ సన్మానం

6లో

# స్వంత ఇంటిపై ఆశలు..

● డబుల్ బెడ్ స్కీం రద్దు... ● ఇందిరమ్మ ఇళ్ళ పథకానికి శ్రీకారం.. ● నేడు ప్రారంభించనున్న సీఎం రేవంత్ రెడ్డి




**(కరీంనగర్, ఎలగందల్ టైమ్స్)**
కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి రాష్ట్రంలో 2004లో అధికారంలోకి వచ్చిన నాటి సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి పేదవాడి స్వంత ఇంటి కలను సాకారం చేసేందుకు ఇందిరమ్మ ఇళ్ళ పథకాన్ని తెరపైకి తీసుకువచ్చారు. ఈ మేరకు కరీంనగర్ జిల్లాలో పెద్ద ఎత్తున ఇళ్ళ స్థలాలను పంపిణీ చేయడంతో పాటు నిర్మాణానికి రుణాలు కూడా మంజూరు చేయడంతో పలుచోట్ల పెద్ద ఎత్తున కాలనీలు వెలిసాయి. అయితే ఇందిరమ్మ ఇళ్ళ స్థలం 60 గజాలు మాత్రమే ఉండటంతో నివాసానికి సహజంగానే ఇరుకుగా ఉండటంతో చిన్న చిన్న ఇబ్బందులు ఎదురయ్యాయి. అద్దె ఇళ్ళలో నివాసమంటూ నానాతంటాలు పడే చిన్నా చితకా ప్రజానీకానికి ఈ ఇండ్లు ఎంతో మేలు చేసింది. ఇటు పట్టణ, అటు గ్రామీణ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ఇళ్ళ కేటాయింపు జరిగింది. కరీంనగర్ పట్టణానికి సంబంధించిన లబ్దిదారులకు సమీపంలోని చింతకుంట, బద్దిపల్లి, రేకుర్తి, కొత్తపల్లి తదితర గ్రామాల్లో స్థలాలను కేటాయించగా చాలా వరకు నిర్మాణాలు చేపట్టడంతో కాలనీలు కూడా ఏర్పడ్డాయి.

### బీఆర్ఎస్ డబుల్ ఎర...

రాష్ట్రం ఏర్పడిన తర్వాత జరిగిన ఎన్నికల సందర్భంగా బీఆర్ఎస్ వినూత్న ప్రచారానికి శ్రీకారం చుట్టారు. అధికంగా ఉన్న పేద, మధ్య తరగతి వర్గాల స్వంత ఇంటి కలను ఆసరాగా చేసుకొని వరాల జల్లు కురిపించారు. ప్రతీ పేదవాడికి డబుల్ బెడ్ రూం ఇల్లు ప్రభుత్వ ఖర్చులతో నిర్మించి ఇస్తామంటూ ఆశలు కల్పించారు. తొలి ఎన్నికల్లో ప్రజలు ఆయన వెంట నడిచి బీఆర్ఎస్ అధికారంలోకి రావడానికి సహకరించారు. తొలి నాలుగేళ్ళలో కొంతమేరకే కేటాయింపులు జరిగినా కొత్త రాష్ట్రం కావడంతో జాప్యం జరిగిందని రెండో విడత కూడా బడుగు, బల హీనవర్గాలు బీఆర్ఎస్ కు అండగా నిలిచాయి. అయినా కూడా కంటితుడుపు కేటాయింపులే తప్ప నిర్మాణాలు పూర్తయి పేదలకు అందించిన దాఖలాలు అరుదు మాత్రమేనన్న అభిప్రాయం ప్రజల్లో బలంగా వ్యక్తమైంది. గృహలక్ష్మి పథకం ద్వారా ఎన్నికల ముంగిట మరో కొత్త పథకాన్ని తెరపైకి తెచ్చి దరఖాస్తు దారులను కార్యాలయాల చుట్టూ తిప్పించుకొని చేతులెత్తేయడం ప్రజలకు మరింత ఆగ్రహం తెప్పించింది. ఈ కారణంగానే మూడోసారి ఎన్నికల్లో గ్రామీణ ప్రాంతాల్లో బీఆర్ఎస్ కు ఆదరణ కరువైందని తెలుస్తోంది.

### ఆది నుంచి వివాదాస్పదమే...

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణం, పంపిణీ ప్రహసనంగా సాగింది. 10 వేల ఇళ్ల నిర్మాణం పూర్తయి ఏళ్లు గడుస్తున్నా ప్రభుత్వం పంపిణీ చేయలేకపోయింది. ఇళ్ల కోసం దరఖాస్తులు ఎక్కువ సంఖ్యలో రావడం, నిర్మించిన ఇళ్ల సంఖ్య తక్కువగా ఉండడంతో ఎవరికి ఇవ్వాలో తెలియక జాప్యం జరిగింది. జిల్లాకు 25,815 ఇండ్లు మంజూరైతే 10,092 ఇళ్ల నిర్మాణం పూర్తి కాగా కేవలం 1,520 ఇండ్లు మాత్రమే పంపిణీ చేశారు. పంపిణీ చేసిన చోట కూడా అనర్హుల పేర్లు జాబితాలో చేర్చి డ్రా తీశారనే విమర్శలు వెల్లువెత్తాయి. మరో 7,513 ఇళ్ల నిర్మాణం ఇప్పటివరకు మొదలుకాలేదు. నిర్మాణ పనులు జరుగుతున్న ఇళ్లలో చాలా వరకు పిల్లర్లు, స్లాబ్ దశలోనే ఉన్నాయి.

జిల్లాకు 6,564 ఇళ్లు మంజూరైతే ఇందులో 789 ఇళ్లు/ఫ్లాట్ల నిర్మాణం పూర్తయింది. మరో 4,118 ఇళ్లు నిర్మాణంలోఉన్నాయి. ఇప్పటి వరకు ఈ జిల్లాలో 388 ఇళ్లను మాత్రమే పేదలకు పంపిణీ చేశారు. ఈ జిల్లాలో ఇంకా 1657 ఇళ్లకు ఇప్పటి వరకు పునాది తీయలేదు.

కరీంనగర్ శివారులోని చింతకుంటలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఫ్లాట్ల ఆక్రమణకు పలుమార్లు యత్నించారు. కొందరైతే ఏకంగా ఫ్లాట్ల డోర్లకు తమ పేర్లు రాసుకున్నారు. దీంతో చట్టపరమైన చర్యలు తప్పవంటూ పోలీసులు ఓ ఫ్లెక్సీని ఏర్పా టు చేయాల్సి వచ్చింది.

### నియోజకవర్గానికి 3500 ఇళ్ళు...

ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీల్లో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి కొత్తగూడెం సభలో ఇందిరమ్మ ఇళ్ళ కేటాయింపు పథకానికి శ్రీకారం చుట్టనున్నారు. ప్రతీ అసెంబ్లీ నియోజకవరానికి 3500 ఇందిరమ్మ ఇండ్ల చొప్పున తొలి విడతగా పంపిణీ చేసేందుకు రంగం సిద్ధం చేస్తోంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు సుమారు 50 వేల వరకు ఇందిరమ్మ ఇళ్ళు మంజూరయ్యే అవకాశం ఉంది. ఈ పథకం పట్ల పేద, మధ్య తరగతి వర్గాల్లో హర్షం వ్యక్తమవుతోంది.

### స్వంత స్థలముంటే 5 లక్షల సాయం...

ఇందిరమ్మ స్థలంతో పాటు స్వంత స్థలమున్న వారికి ఐదు లక్షల రూపాయల మేరకు విడతల వారీగా ఆర్థిక సాయం అందించాలని కూడా ప్రభుత్వం నిర్ణయించింది. ఈ పథకం కూడా సోమవారం నుంచే అందుబాటులోకి రానున్నది. తద్వారా గ్రామీణ ప్రాంతాల్లో స్వంత స్థలముండి నిర్మాణానికి ఇబ్బందులు పడే పేద, మధ్య తరగతి వర్గాలకు కూడా ఈ పథకం వరంలాంటిదని చెబుతున్నారు. ఈ రెండూ కూడా సోమవారం నుంచి అమలులోకి రానున్నాయి.

# భగీరథుడయ్యాడు

● చొప్పదండి ఎమ్మెల్యేపై ప్రశంసలు
● నెలలోనే రెండోసారి రిజర్వాయర్ కు సాగునీరు...
● పరవళ్ళు తొక్కుతున్న నారాయణపూర్ ● రైతుల్లో హర్షా తిరేకాలు



**(చొప్పదండి, ఎలగందల్ టైమ్స్)**
యువ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చొరవ పట్ల చొప్పదండి నియోజకవర్గ ప్రజల్లో హర్షం వ్యక్తమవుతోంది. గత ప్రజాప్రతినిధులకు భిన్నంగా ప్రజలకు సేవ చేయడమే లక్ష్యంగా పెట్టుకొని ఎవరికీ ఏ అవసరం వచ్చినా అండగా ఉంటూ వస్తున్న సత్యం తాజాగా రైతాంగానికి అండగా నిలిచిన తీరు ప్రశంసలనందుకుంటున్నది. నెలరోజుల వ్యవధిలోనే ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి నారాయణపూర్ రిజర్వాయర్ కు రెండవసారి నీటిని విడుదల చేసేలా చూడటంతో రైతులు సంబరపడిపోతున్నారు. ఎన్నికల సందర్భంగా రైతులకు ఇచ్చిన హామీ మేరకు పంటలు ఉండిపోకుండా చివరి మడి వరకు సాగునీరు అందించి కాపాడుతానని ప్రకటించిన మేడిపల్లి సత్యం నారాయణపూర్ రిజర్వాయర్ కు నీటి విడుదల విషయంలో చూపిన చొరవ కారణంగా రైతుల కళ్ళల్లో సంతోషం తొణికిసలాడుతోంది. జిల్లాలో పలుచోట్ల పంట భూములు పగుళ్ళు బారుతున్నాయంటూ రైతాంగం ఆందోళన వ్యక్తం చేస్తున్న తరుణంలో నారాయణ పూర్ రిజర్వాయర్ కు నెల రోజుల్లోనే రెండోసారి నీటిని విడుదల చేయడం గమనార్హం. కరువు నేలను సిరుల సీమగా మార్చడానికి గంగాధర గడ్డపై గోదారమ్మ పరవళ్ళు తొక్కింది.

చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం భగీరథ ప్రయత్నం వల్లే గంగాధర మండలం నారాయణపూర్ రిజర్వాయర్ కు నీటిని విడుదల చేశారని తెలుస్తోంది. పొట్ట దశలో ఉన్న వరి పొలాలకు జీవం పోస్తూ గంగాధర గడ్డపై గోదారమ్మ పరవళ్ళు తొక్కడంతో అన్నదాతలు సంతోషం వ్యక్తం చేశారు. చొప్పదండి నియోజకవర్గ ప్రజల సంక్షేమమే తన లక్ష్యమని, అన్నదాతలు ఇబ్బంది పడకుండా అధికారులతో మాట్లాడి ఎల్లంపల్లి ప్రాజెక్టు నుండి నారాయణపూర్ రిజర్వాయర్కు నీటిని విడుదల చేయించామని మేడిపల్లి సత్యం తెలిపారు. ప్రతిపక్షాల అబద్ధపు ప్రచారాన్ని నమ్మి అన్నదాతలు ఆందోళన చెందవద్దని, రైతులను కడుపులో పెట్టుకొని కాపాడుకుంటామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. సాగు చేసిన పంటలు ఎండిపోకుండా సకాలంలో నారాయణపూర్ రిజర్వాయర్ కు నీటిని విడుదల చేయించిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కు చొప్పదండి నియోజకవర్గం రైతాంగం కృతజ్ఞతలు తెలిపారు.

# కళకు వన్నె తెచ్చిన అల్ఫోర్స్ మౌక్తికం

**కరీంనగర్, ఎలగందల్ టైమ్స్ :** నేటి పోటి ప్రపంచంలో ప్రతి విద్యార్థికి కళల పట్ల అవహగహన ఉండడమే కాకుండా అందులో పాల్గొనేందుకు ఆసక్తితో ఉండాలని "పద్మశ్రీ" అవార్డు గ్రహీత చింతకింది మల్లేశం , అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా వి. నరేందర్ రెడ్డి గారితో కలిసి స్థానిక వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ స్కూల్ ఆఫ్ జెన్స్ మైదానంలో మౌక్తికం పేరుతో నిర్వహింపబడిన అల్ఫోర్స్ టైనీ టాట్స్ హైస్కూల్ వార్షికోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రారంభానికి ముందు వారు చదువుల తల్లి, సరస్వతికి పూజ కార్యక్రమాన్ని నిర్వహించి జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రామాన్ని అట్టహాసంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు కళల పట్ల అవగహానకలిగి ఉండమే కాక కాకుండా వాటిలో పాల్గొనాలని తద్వారా సమాజంలో సముచిత గుర్తింపు లభిస్తుందని చెప్పారు. విద్యాసంస్థల అధినేత డా. వి. నరేందర్ రెడ్డి గారు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాలను ఏర్పాటు చేసుకొని వాటిని త్వరగతిన సాధించి చాలా గొప్పగా వ్యవహరించాలని చెప్పారు. విద్యార్థులు ప్రదర్శించిన వెల్కమ్ డ్యాన్స్, ఫోక్ డ్యాన్స్, బుర్ర కథ, తదితర ప్రదర్శనలు చాలా ఆకట్టుకున్నాయని చెప్పారు.



## కరీంనగర్ కదనభేరికి కదలిరండి..

- కరీంనగర్‌లో బీఆర్ఎస్వీ, బీఆర్ఎస్‌వై డప్పు చాటింపు కార్యక్రమం



**కరీంనగర్, ఎలగందల్ టైమ్స్:** కరీంనగర్‌లో ఈ నెల 12న నిర్వహించే కరీంనగర్ కదనభేరి కార్యక్రమంలో ప్రజలంతా భారీ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని.. కరీంనగర్ ఎంపీగా బోయినపల్లి వినోద్ కుమార్‌ను గెలిపించాలని బీఆర్ఎస్వీ, బీఆర్ఎస్‌వై నాయకులు ఆదివారం కరీంనగర్ తెలంగాణ చౌక్‌లో డప్పు చాటింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ కరీంనగర్ పట్టణ అధ్యక్షుడు చల్ల హరిశంకర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం కోసం 14 ఏళ్ళు పోరాటం చేసి, కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంను తొలిముఖ్యమంత్రి కేసీఆర్ దేశంలో అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపారని పేర్కొన్నారు. కరీంనగర్ అభివృద్ధి కోసం ఐదేళ్లలో బండి సంజయ్ ఎంపీగా గెలిచి నయాపైసా తేలేదని అన్నారు. ఈ సారి పార్లమెంట్ ఎన్నికల్లో బోయినపల్లి వినోద్ కుమార్ ఎంపీగా గెలవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏనుగు రవీందర్ రెడ్డి, పొన్నం అనీల్ గౌడ్, జక్కుల నాగరాజు యాదవ్, తిరుపతి నాయక్, శ్రీనాథ్ గౌడ్, ద్వావ మధుసూదన్ రెడ్డి, కేంసారం తిరుపతి, దూలం సంపత్ గౌడ్ ,వెంకట్, హరీష్, పర్శరాం, రవినాయక్, రాజునాయక్, సత్తినేని శ్రీనివాస్, అజయ్ గౌడ్, సాకేత్, మహేందర్, రాజశేఖర్, వేణు, మోహన్, ఓంకార్, సాయికృష్ణ, శ్రీను, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు కోరా విద్యార్థి

**కరీంనగర్, ఎలగందల్ టైమ్స్:** నగరంలోని కోరా ఉన్నత పాఠశాలలో చదువుతున్న యోగేశ్వరి తొమ్మిదో తరగతి విద్యార్థి రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొని అత్యంత ప్రతిభ కనబరిచి జాతియస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికయింది. ఈ నెల 15వ తేదీన ఉత్తరప్రదేశ్ లోని దాద్రా ప్రదేశంలో ఆనంద్ ఇంటర్నేషనల్ పబ్లిక్ స్కూల్లో జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో యోగేశ్వరి మార్చి 15 నుండి 21వ తేది వరకు హాజరుకానుంది. దీనికి గాను పాఠశాల యాజమాన్యం విద్యార్థికి పదివేల రూపాయలు ఆర్థిక సాయం అందించారు. పాఠశాల చైర్మన్ మహిపాల్ రెడ్డి, డైరెక్టర్లు వరప్రసాద్ రాంరెడ్డి, సింహాచలం హరికృష్ణ, వంగలసంతోష్ రెడ్డి విద్యార్థికి, విద్యార్థి తల్లికి శాలువా, పుష్పగుచ్ఛం మెమొంటోతో సత్కరించారు. శిక్షణ ఇచ్చిన పి.ఇ.టి దుర్గరాజుకి శుభాకాంక్షలు తెలియచేశారు.




## పురుషుల పొదుపు సంఘం అధ్యక్షుడిగా సంపత్ గౌడ్

**హుస్నాబాద్, ఎలగందల్ టైమ్స్:** చౌటపల్లి పురుషుల పొదుపు పరస్పర సహాయక సహకార పరిమిత సంఘానికి అధ్యక్షుడిగా మంద సంపత్ గౌడ్, ఉపాధ్యక్షుడిగా ఇటికాల అనిల్ ఎన్నికయ్యారు. అక్కన్నపేట మండలం చౌటపల్లి గ్రామ పురుషుల పొదుపు సంఘం సభ్యులు ఆదివారం రోజున 22వ వార్షిక సభను స్థానిక పురుషుల పొదుపు సంఘ భవనంలో నిర్వహించారు. ఈ సభలో ముఖ్యఅతిథిగా సమితి అధ్యక్షులు రంగు తిరుపతి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఖాళీ అయిన స్థానాలకు ఓటింగ్ ద్వారా ఎన్నికలు నిర్వహించగా మంద సంపత్ గౌడ్, చల్లగొండ సంపత్ రావు, గౌరవేని కుమారస్వామి, గౌరవేని శ్రీనివాస్ లు గెలుపొందగా పాలకవర్గ సభ్యులందరూ కలిసి అధ్యక్ష ఉపాధ్యక్షులను ఎన్నుకున్నారు.

ఈ కార్యక్రమంలో తాజా మాజీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు గంటల శ్రీనివాస్, ఇల్లందుల రమేష్, పాలకవర్గ సభ్యులు మంద మల్లేశం, గంటల రాము, మంద రవి, గాదర్ల నాగభూషణం, సుమారు 200 మంది సభ్యులు పాల్గొన్నారు.



# సావిత్రిభాయి ఫూలెకు ఘన నివాళులు..



**కరీంనగర్, ఎలగందల్ టైమ్స్:** ఆదివారం ఉల్లంపల్లి గ్రామంలో సావిత్రి బాయి పూలె వర్ధంతి పురస్కరించుకొని గ్రామ యువప్రతిభ యూత్ అధ్యక్షులు సుధగోని శ్రీనివాస్ ఆధ్వర్యంలో పూలె దంపతుల ఫోటోలకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పూదరి శ్రీనివాస్, పెరుమాండ్ల నర్సాగౌడ్, కక్కెర్ల రవీందర్ గౌడ్ మాట్లాడుతూ సమాజంలో అసమానతల మీద అలుపెరుగని పోరాటం చేసిన గొప్ప సంఘ సంస్కర్త, మహిళా చైతన్య మూర్తి సావిత్రి బాయి పూలె అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కోల వెంకటస్వామి, బొంగోని శ్రీనివాస్ గౌడ్, బత్తిని రామస్వామి గౌడ్, బుర్ర సంపత్ కుమార్ గౌడ్, సుధగోని రాములు, పంజాల శివ, కొత్త శేఖర్, పెరుమాండ్ల శ్రీనివాస్ గౌడ్, అలువల వెంకటస్వామి తదితరులు పాల్గొని సావిత్రి భాయికి నివాళులు అర్పించారు.

### మిత్రమండలి (1986–87) ఆధ్వర్యంలో..

**హుస్నాబాద్, ఎలగందల్ టైమ్స్:** మిత్రమండలి 87 ఆధ్వర్యంలో భారత తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే వర్ధంతి వేడుకలు ఆదివారం హుస్నాబాద్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. భారత తొలి మహిళ ఉపాధ్యాయురాలు, బాలికా విద్య అభివృద్ధికి కృషి చేసిన సంఘసంస్కర్త సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగా హుస్నాబాద్ మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ ఐలేని అనిత రెడ్డి, మిత్రమండలి 87 అధ్యక్షులు బూట్ల రాజమల్లయ్య, ప్రధాన కార్యదర్శి దొడ్డి శ్రీనివాస్‌లు సావిత్రి బాయి పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే మార్చి 10, 1897 సంవత్సరం లో పరమపదించారని గుర్తు చేశారు. సావిత్రి బాయి పూలే ఆమె భర్త జ్యోతిరావు పూలే ప్రోత్సాహంతో దేశంలో తొలి మహిళా ఉపాధ్యాయురాలుగా బాలికా విద్య అభివృద్ధికై అనేక పాఠశాలలు నెలకొల్పిన గొప్ప సంఘ సంస్కర్త అని సావిత్రి బాయి పూలే సేవలను కొనియాడారు. పాఠశాల వజ్రోత్సవాల సందర్భంగా (1986–87 ఎస్సెస్సీ బ్యాచ్)పూర్వ విద్యార్థులైన మిత్రమండలి 87 బృందం సావిత్రి బాయి పూలే పాలరాతి విగ్రహాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మిత్రమండలి 87 కోశాధికారి పెరుమాండ్ల శ్రీనివాస్ గౌడ్, ఆర్గనైజింగ్ కార్యదర్శి చిత్తారి శ్రీనివాస్ పటేల్, కార్యదర్శులు కానుగుల మోహన్, గుండోజు రాజేంద్రప్రసాద్,బి.మహేందర్, పాఠశాల ఉపాధ్యాయులు వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో..

**కరీంనగర్, ఎలగందల్ టైమ్స్:** జ్యోతి నగర్ లోని బిసి సంక్షేమ సంఘం కార్యాలయంలోసావిత్రిబాయి పూలే వర్ధంతిని పురస్కరించుకొని ఆమె చిత్రపటానికి బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్ పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆడపిల్లల చదువు కోసం నిరంతరం పాటుపడిన మహిళ చైతన్య మూర్తి సమాజంలో రుగ్మతలు రూపుమాపడానికి విశేష కృషి చేసిన సామాజిక ఉద్యమకారిణి సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగా ఆ మహనీయురాలికి ఇవే మా ఘన నివాళులు అని అన్నారు. ఈ కార్యక్రమంలో గుమ్మడి శ్రీనివాస్, సంధ్యా, స్వప్న, రాజు, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ మహమ్మాయి దేవిని దర్శించుకున్న ఆర్టీసీ ఎండీ సజ్జనార్



**కరీంనగర్, ఎలగందల్ టైమ్స్:** శ్రీ మహమ్మాయి దేవి అమ్మ వారిని దర్శించుకోవడం పూర్వ జన్మ సుకృతంగా భావిస్తున్నానని ఆర్టీసీ ఎండి, ఐపీఎస్ సజ్జనార్ అన్నారు. ఆదివారం ఆలయ దర్శనానికి వచ్చిన సజ్జనార్‌కు ఆలయ కమిటీ సభ్యులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం ఎలగందుల గ్రామంలోని అతి పురాతనమైన శ్రీ మహమ్మాయిదేవి ఆలయంలో అమ్మవారిని ఆర్టీసి ఎండి సజ్జనార్ దర్శించుకొని అమ్మవారి విశిష్టత గురించి అర్చకులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి అమావాస్య రోజు జరిగే హోమంలో సజ్జనార్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కమిటీ చైర్మన్ గుండోజు లక్ష్మణ్ చారి, ఉపాధ్యక్షులు గజ్జెల హరిహర చారి, ఆలయ ప్రధాన అర్చకులు చిలుకూరి తిరుపతాచార్యులు, వెంకటాచారి, కొత్తపెల్లి బ్రహ్మాచారి, పొన్నం ఉదయ్ కుమార్, కొత్తపల్లి మండల బిజెపి అధ్యక్షులు కడార్ల రతన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్టీసీ ఎండీ వి.సి.సజ్జనార్‌ను ఎంపిటిసి మంద రమేష్ గౌడ్ శాలువా కప్పి సత్కరించారు.



## యువజన సమస్యల పరిష్కారానికి పోరాటం

- డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి వెంకటేష్



కరీంనగర్, ఎలగందల్ టైమ్స్: దేశంలో యువతీ యువకులు ఎదుర్కొంటున్న సమస్యలపై డివైఎఫ్ఐ అనునిత్యం పోరాటాలు నిర్వహిస్తుందని డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి వెంకటేష్ అన్నారు. ఆదివారం భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని కరీంనగర్ జిల్లా కేంద్రంలో తెలంగాణ చౌక్ వద్ద ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి వెంకటేష్ మాట్లాడుతూ దేశంలో యువజన సమస్యలపై రాజీలేని పోరాటాలు నిర్వహిస్తూ కోటి యాభై లక్షల సభ్యత్వంతో దేశంలో అతిపెద్ద యువజన సంఘంగా వెలుగొందుతుందన్నారు. బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడిన విప్లవ వీరకిశోరం భగత్‌సింగ్ స్ఫూర్తితో అందరికీ విద్య, ఉపాధి కల్పించాలని ఉద్యమిస్తుందన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ప్రతి ఏటా రెండు కోట్ల ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పిస్తామని చెప్పి పది సంవత్సరాలు గడుస్తున్నా యువతకు ఉపాధి కల్పించకుండా మోసం చేసిందన్నారు. మతోన్మాదం పేరుతో విద్వేషాలను రెచ్చగొడుతూ పబ్బం గడుపుతుందన్నారు. రానున్న పార్లమెంటు ఎన్నికల్లో బిజెపికి తగిన గుణపాఠం చెప్పాలని యువతకు పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రంలో గ్రూప్ 1, 2, 3, డిఎస్సీ నోటిఫికేషన్లు విడుదలయ్యాయని, పరీక్ష తేదీలను టిఎస్పిఎస్సి విడుదల చేసిందన్నారు. ప్రభుత్వం ప్రతి నియోజకవర్గంలో ఉచిత కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేసి అందరికీ ఉచిత కోచింగ్ ఇప్పించాలని, దూర ప్రాంత యువతకు వసతి కల్పించాలని, ఉచితంగా బుక్స్ పంపిణీ చేయాలని కోరారు. ప్రైవేట్ కోచింగ్ సెంటర్స్ ఫీజుల దోపిడీని అరికట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నరేష్ పటేల్, తిరుపతి నాయక్, నాయకులు విజయ్, శ్రావణ్, అజయ్, శ్రీనివాస్, తరుణ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందుర్తిలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం



చిగురుమామిడి, ఎలగందల్ టైమ్స్: కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం ఇందుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1993-94 బ్యాచ్ పదో తరగతికి చెందిన దాదాపు 70 మంది విద్యార్థులు ఒకే వేదికపై ఆదివారం కలిశారు. అదే ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న వారు సోషల్ మీడియా వేదికగా కలుసుకొని ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసుకున్నారు. గత జ్ఞాపకాలను గుర్తు చేసుకొని పరిచయ కార్యక్రమాలు నిర్వహించారు. సుమారు లక్ష రూపాయలు విలువైన జాతీయ చిహ్నం గద్దెను 93-94 బ్యాచ్ గుర్తుగా పాఠశాలలో నిర్మించి ప్రస్తుత హెచ్ఎం జయప్రద చేతుల మీదుగా ఆవిష్కరించారు. అంతకుముందు గ్రామంలో గురువులను డీజే సౌండ్స్‌తో ఆటపాటలతో ర్యాలీగా పాఠశాల వద్దకు పూల వర్షంతో తీసుకువచ్చారు. మొదటగా పాఠశాలలో ప్రేయర్ నిర్వహించారు. అనంతరం ఒకరినొకరు పలకరించుకొని చిన్ననాటి జ్ఞాపకాలను పంచుకున్నారు. నాడు చదువు చెప్పిన గురువులకు శాలువాలు కప్పి, మెమొంటోలు అందజేసి వారి ఆశీర్వాదం తీసుకున్నారు. కేక్ కట్ చేసిన అనంతరం అందరూ కలిసి సహపంక్తి భోజనాలు చేసి ఉత్సాహంగా గడిపారు. జాతీయ చిహ్నం తయారుచేసిన ఆకుల వెంకటేష్ వారి బ్యాచ్‌లో ఒకరు కావడం విశేషం. వారిని సైతం శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జయప్రద, గురువులు రామచంద్రం, శివప్రసాద్, జైసింగ్ నరహరి, చీకోటి రమణయ్య, జగపతిరావు, పూర్వ విద్యార్థులు భీమర లక్ష్మణ్, కాంతల శ్రీనివాస్ రెడ్డి, బోయిని శ్రీనివాస్, కాంతాల తిరుపతిరెడ్డి, ఆకుల వెంకటేష్, కూన సంపత్ కుమార్,హర్జణపల్లి రాజు,వేముల సదానందం, తోట లక్ష్మణ్, ఎండి మక్బుల్ పాషా, గట్టు పరుశరాములు, నరాల రాజయ్య, బొమ్మగాని మధు, సుద్దాల పవన్ కుమార్, చింతపుల పరశురాములు, గట్టు మధు, రాజిరెడ్డి, బుచ్చమ్మ, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

# వ్యాయామంతోనే సంపూర్ణ ఆరోగ్యం

- జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి
- ఉల్లాసంగా, ఉత్సాహంగా 5కే రన్




కరీంనగర్, ఎలగందల్ టైమ్స్: వ్యాయామంతోనే మానసికోల్లాసంతోపాటు సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని, దీనిపై అందరూ ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు. వ్యాయామాన్ని దినచర్యలో ఒక భాగం చేసుకోవాలని సూచించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని ఆదివారం కరీంనగర్ రన్నర్స్ అండ్ సైక్లిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కరీంనగర్ లోని మానేరు డ్యాంపై 5కే రన్, వాకింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై 5కే రన్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యంగా ఉత్సాహంగా ఉండాలంటే ప్రతి రోజూ శారీరక వ్యాయామాన్ని చేయాలని సూచించారు. ఆరోగ్యంపై నిర్లక్ష్యంగా ఉండవద్దని పేర్కొన్నారు. బాధ్యతలు, పని ఒత్తిడి ఎక్కువ ఉండడం వల్ల మహిళలు తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని తెలిపారు. ఒత్తిడి, మానసిక సమస్యల నుంచి బయటపడాలంటే ఆరోగ్యాన్ని కాపాడుకోవడం ముఖ్యమని పేర్కొన్నారు. ఫిట్నెస్‌పై కరీంనగర్ ప్రజల్లో ముఖ్యంగా మహిళల్లో అవగాహన కల్పించేందుకు కరీంనగర్ రన్నర్స్ అండ్ సైక్లిస్ట్ అసోసియేషన్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు.

మార్కెటింగ్ శాఖ అధికారి పద్మావతి మాట్లాడుతూ మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలనే ఉద్దేశంతో 5కే రన్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. రన్నర్స్ అండ్ సైక్లిస్ట్ అసోసియేషన్లో సభ్యులుగా ఉన్న మహిళలు తమ దినచర్యలో సైక్లింగ్, రన్నింగ్, వాకింగ్ భాగం చేసుకోవాలని కోరారు. "తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్" ప్రతినిధులు మంచినీరు, స్నాక్స్ అందజేశారు. సైక్లింగ్లో రాణిస్తున్న మహిళా సభ్యులను జిల్లా కలెక్టర్ సన్మానించారు. అనంతరం జిల్లా కలెక్టర్ జెండా ఊపి 5 కే రన్ ను ప్రారంభించారు. వాకర్స్, మహిళలు, యువతీ యువకులు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమానికి తరలివచ్చారు. వారితో కలిసి కలెక్టర్ దాదాపు మూడు కిలోమీటర్లు రన్నింగ్ చేశారు.

ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ అధికారి పద్మావతి, కరీంనగర్ రన్నర్స్ అండ్ సైకిలిస్టు అసోసియేషన్ అధ్యక్షుడు పసుల మహేష్, మహిళా పోలీస్ స్టేషన్ సిఐ శ్రీలత, వన్ టౌన్ సిఐ సరిలాల్, మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ స్వరూపారాణి, రన్నర్ అండ్ సైక్లిస్ట్ అసోసియేషన్ సభ్యులు విమల, హేమ భట్, స్వప్న, గాయత్రి ,గీతిక, కావ్య, ఉషా ఖండాల్, రవీందర్, శివ, రోహిత్, సంతోష్, శేఖర్, కిరణ్, అజయ్ ఖండాల్, అఖిల్, పరుశరాం, గులాబ్ సింగ్ చౌహాన్, శ్రీనివాస్, సాయి, తదితరులు పాల్గొన్నారు.


సుమ హాస్పిటల్
సివిల్ హాస్పిటల్ ప్రక్కన,
కరీంనగర్




- చదువు మీద ఆసక్తి తగ్గడం
- తల్లిదండ్రులపై మర్లపడడం
- అతిగా కోపం రావడం
- ప్రవర్తనలో మార్పు రావడం
- PUBG & Phone Addiction

"Behavioural problems" కావచ్చు

సంప్రదించండి

Dr. L. వర్షి
MBBS, MD (PSY)(OSM)
IMH-ఎర్రగడ్డ
నరాల, సెక్స్, ఆల్కహాల్ & మానసిక వైద్య నిపుణులు
+91 9912424343

## మున్నూరుకాపులు ఐక్యంగా ఉండాలి

- మున్నూరు కాపు విద్యార్థి వసతి గృహం ట్రస్ట్ చైర్మన్ బొమ్మ శ్రీరాం చక్రవర్తి



**కరీంనగర్, ఎలగందల్ టైమ్స్:** మున్నూరు కాపులు ఐక్యంగా ఉండే హక్కులు సాధించుకోవాలని మున్నూరు కాపు విద్యార్థి కమిటీ ట్రస్ట్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి అన్నారు. ఆదివారం కరీంనగర్‌లోని విద్యానగర్ మున్నూరు కాపు సంఘం నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించి ఆయన మాట్లాడారు. జిల్లాలో కాపులంతా ఐక్యంగా ఉండి కులాన్ని బలోపేతం చేయాలన్నారు. కేవలం కరీంనగర్ మున్నూరుకాపు సంఘానికి పరిమితం కాకుండా ప్రతి గ్రామంలో ప్రతి వార్డుల్లో సంఘాలను ఏర్పాటు చేసి సంఘ అభివృద్ధికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని అన్నారు. జిల్లా కమిటీలో ప్రతి ఒక్కరు బాధ్యులు కావాలని సూచించారు ఇప్పటికే మనకు వసతిగృహం ఉందని త్వరలోనే ఫంక్షన్ హాల్ సైతం ఏర్పాటు చేస్తామన్నారు. జిల్లా అధ్యక్షులు బొమ్మనాతి రాధాకృష్ణ మాట్లాడుతూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ప్రతి కాపు సంఘానికి తమ వంతుగా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. కాంగ్రెస్ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గం ఇంచార్జ్ పురమళ్ళ శ్రీనివాస్ మాట్లాడుతూ కాపుల ఐక్యతతోనే ఏదైనా సాధించవచ్చునని అన్నారు. నగర అధ్యక్షులు నల్వాల రవీందర్ మాట్లాడుతూ జిల్లాలో కాపుల ఐక్యత బాగుందని రానున్న రోజుల్లో మరింత బలోపేతం చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. నూతనంగా ఎన్నికైన గౌరవ అధ్యక్షులు బోనాల నరసయ్య, అధ్యక్ష కార్యదర్శులు కనకం అమర్ బాబు, అట్టేపల్లి శ్రీనివాస్ కోశాధికారి ఐల రామోహన్ తో పాటు కార్యవర్గంచే ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో అర్బన్ బ్యాంక్ మాజీ చైర్మన్ కర్ర రాజశేఖర్, తెలంగాణ మెడికల్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ బండారి రాజ్ కుమార్, డాక్టర్ సాయిని నరేందర్, కార్పొరేటర్లు కొండపల్లి సరిత సతీష్, దిండిగాల మహేష్, స్తంభంకాడి గంగాధర్, ఏన్నం శ్రీనివాస్, కుదురు రవి, ఉప్పు జలపతి తదితరులు పాల్గొన్నారు.

## మహిళల చదరంగ పోటీల్లో విశేష స్పందన



**కరీంనగర్, ఎలగందల్ టైమ్స్:** మహిళా దినోత్సవ సందర్భంగా ఆదివారం జీనియస్ చెస్ అకాడమీ మరియు తెలంగాణ డెమోక్రటిక్ చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జీనియస్ చెస్ అకాడమీ వారు నిర్వహించిన మహిళా చదరంగం పోటీలో వివిధ జిల్లాల నుంచి విశేష స్పందన లభించింది ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రైమ్ కిడ్నీ కైండ్లీ కేర్ క్లీనింగ్ డాక్టర్ కొత్త చాందిని కృష్ణచైతన్య, మాట్లాడుతూ చదరంగం తో మేధాశక్తి ఏకాగ్రత పెంపొందుతుందని మహిళలు చదరంగం పిల్లలకు నేర్పించాలని అని అన్నారు

జీనియస్ చెస్ అకాడమీ డైరెక్టర్ క0కటి అనుప్ గారు మాట్లాడుతూ ఇంత మంచి విశేష స్పందన వచ్చినందుకు సంతోషంగా ఉందని మేము మహిళలకు ఎప్పుడు మా చెస్ అకాడమీ తోడుగా ఉంటుందని అన్నారు తదుపరి విజేతలకు నగదు బహుమతులు మెమెంటోలు మరియు పాల్గొన్న ప్రతి ఒక్కరికి సర్టిఫికెట్ను అందజేశారు ఇందులో 6 సంవత్సరాల నుండి 65 సంవత్సరాల మహిళలు పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో జీనియస్ చేస్తాకాడమీ వ్యవస్థాపకులు క%శీ%కటి కనకయ్య, డాక్టర్ కృష్ణ చైతన్య, భరోసా స్వచ్ఛంద సేవ వ్యవస్థాపకులు శివజ్యోతి నాగరాజు, సెక్రజిస్ట్ కాయికి అనిత, తెలంగాణ డెమొక్రటిక్ అసోసియేషన్ కార్యదర్శులు సృజన్, తాటిపల్లి సతీష్ బాబు, చెఫ్ ఆర్బిటర్ తరుణ్ ఆర్బిటర్స్ అరుణ్ , రేవిక్ వర్ధన్, నితిన్ అభిరామ్ , తదితరులు పాల్గొన్నారు.



# మహిళలు అన్ని రంగాలలో రాణించాలి


- మంత్రి పొన్నం ప్రభాకర్

**కరీంనగర్, ఎలగందల్ టైమ్స్:** అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని కరీంనగర్ ప్రెస్ క్లబ్‌లో ఆదివారం తెలంగాణ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు రాపోలు వీరమోహన్ అధ్యక్షతలో మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని మా గౌడ సంఘం తో పాటు పద్మశాలి సంఘం ఆడపడుచులు అంటే కూడా తనకు చాలా గౌరవం అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆడపడుచులకు అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తూ బస్సులో ఉచిత ప్రయాణాలు కూడా అందించడం జరిగిందని ఇకముందు కూడా మహిళల కోసం ఎన్నో పథకాలు ప్రవేశపెడతామని తెలిపారు. చేనేత కార్మికుల ఐక్యత కోసం నేనెప్పుడూ ముందుంటానని, మీకు ఎలాంటి సమస్య వచ్చిన తన దగ్గరికి రావచ్చని అన్నారు. పద్మశాలి సంఘానికి గతంలో ఎంపీగా






ఉన్నప్పుడు తాను ఎంతో కృషి చేశానని ఇకముందు కూడా మంత్రిగా పద్మశాలి సంఘాలకు తన వంతు సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని చెప్పారు. మహిళా దినోత్సవానికి నన్ను ఆహ్వానించినందుకు చేనేత ఐక్యవేదిక రాష్ట్ర కమిటీకి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కూడా తెలంగాణ చేనేత కార్మికుల సమస్య పట్ల చిత్తశుద్ధితో ఉన్నారని మీ సమస్యలను కూడా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి తక్షణమే పరిష్కరించే విధంగా కృషి చేస్తానని అన్నారు. అనంతరం మంత్రి మహిళలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో చేనేత ఐక్యవేదిక కార్యనిర్వాహణాధికారి కోటిపల్లి సదానందం, కోశాధికారి చిలువేరు గణేష్, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్, జడల చిరంజీవి, భాస్కర్, రావిరాల శ్రీనివాస్, వెంకటేశ్వర్లు మంచి కట్ల కోటేశ్వర్ మహిళ నాయకురాలు గుడా లావణ్య, చిందం సునీత, పోచం సునీత, కార్పోరేటర్ చొప్పరి జయశ్రీ, అందే జ్యోతి, కృష్ణవేణి, బుర్ర మల్లేశం, స్వర్గం మల్లేశం, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.



# ఆరు గ్యారంటీలను అమలు చేయాల్సిందే..

- ఎల్లుండి కేబినెట్‌లో వాటికి ఆమోదం తెలిపి నిధులు విడుదల చేయాల్సిందే
- మల్యాల ప్రజాహిత యాత్రలో బండి సంజయ్





**జగిత్యాల, ఎలగందల్ టైమ్స్:** "ఎల్లుండి రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఉంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు 6 గ్యారంటీల అమలుకు ఆమోద ముద్ర వేయడంతోపాటు వాటి అమలుకు సరిపడ నిధులను విడుదల చేసి కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధిని నిరూపించుకోవాలి"అని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా 6 గ్యారంటీల అంశాన్ని ప్రస్తావిస్తూ.. "మహాలక్ష్మీ పథకం కింద కోటిన్నర మంది మహిళలకు నెలకు 2 వేల 500 రూపాయలు, రైతు భరోసా కింద ఎకరాకు 15 వేల చొప్పున, రాష్ట్రంలో 15 లక్షల మంది వ్యవసాయ కూలీలకు ఎకరాకు 12 వేల రూపాయలు, వరి పంటకు ఎకరాకు 500 చొప్పున బోనస్ ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ పథకాలకయ్యే నిధులను తక్షణమే విడుదల చేయాలి. ఇందిరమ్మ ఇండ్ల కింద ఇండ్లు లేని 25 లక్షల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.5 లక్షలు, తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల స్థలం ఇస్తామన్నరు. ఆ నిధులను విడుదల చేయాలి. చేయూత పథకం కింద వృద్దులు, వికలాంగులు, వితంతవులకు ఒక్కొక్కరికి 4 వేల రూపాయల చొప్పున మంజూరు చేయాలి. యువ వికాసం కింద ఒక్కో విద్యార్థికి 5 లక్షల చొప్పున విద్యా భరోసా కార్డు ఇవ్వాలి. ఇవన్నీ కూడా మీరు ప్రకటించిన 6 గ్యారంటీల జాబితాలోనే ఉన్నాయి. వంద రోజుల్లో వీటిని అమలు చేస్తామని ఎన్నికలకు ముందు ఇంటింటికీ తిరిగి హామీ ఇచ్చారు. మేనిఫెస్టోలో కూడా పెట్టారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోవడానికి మీకు మరో 4, 5 రోజులే టైముంది... మాట నిలబటెట్టుకుంటారో.. మాట తప్పి చరిత్ర హీనులుగా మిగులుతారా తేల్చుకోండి.." అని పేర్కొన్నారు.

కేటీఆర్ కండకావరంతో కన్నుమిన్నూ కానకుండా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. నేను పార్లమెంట్‌కు వెళ్లలేదట. ప్రశ్నలు అడగలేదట. పైసా తేలేదేట. కళ్లు నెత్తికెక్కి మాట్లాడుతున్నడు.. ఒక్కసారి లోక్ సభ రికార్డులు తెచ్చుకుని చూడు.. ఎన్ని నిధులు తెచ్చానో లెక్కలన్నీ ఉన్నయ్.. చదువుకో.. మీ అయ్య లెక్క పార్లమెంట్‌కు పోకుండా తాగి పండుకోలే.. చారిత్రాత్మక తెలంగాణ బిల్లుపై చర్చ జరుగుతుంటే కూడా మీ అయ్య వెళ్లి ఓటేయకుండా తాగి పండుకున్నడు. సిగ్గు లేకుండా నా గురించి మాట్లాడుతున్నవా? నీకు దమ్ముంటే పార్లమెంట్ బీఆర్ఎస్ సభ్యులు ఎన్నిసార్లు సభకు వెళ్లారో, నేను ఎన్నిసార్లు వెళ్లానో బయట పెట్టు" అంటూ సవాల్ విసిరారు. ఈనెల 12న కరీంనగర్‌లో బీఆర్ఎస్ కదన భేరీ నిర్వహించడంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు "ప్రజలంతా అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ఊడ్చిపారేసినా సిగ్గు లేకుండా కదన భేరీ నిర్వహిస్తున్నరు. ఆ సభలో కేసీఆర్ ముక్కు నేలకు రాసి ప్రజలకు క్షమాపణ చెబితే తప్ప మిమ్ముల్ని ఎవరూ నమ్మే పరిస్థితి లేదు" అని అన్నారు.

ప్రజాహితయాత్రలో భాగంగా మల్యాల, కొడిమ్యాల మండల కేంద్రానికి వచ్చారు. ఈ సందర్భంగా భారీ ఎత్తున ప్రజలు తరలివచ్చి పూలు చల్లి, టపాసులు పేల్చి, హారతి పట్టి బ్రహ్మరథం పట్టారు.

# కుల గౌరవాన్ని కాపాడుతా..

- బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్..
- ఘనంగా గౌడ సంఘాల ఆత్మీయ సన్మానం...



**కరీంనగర్, ఎలగందల్ టైమ్స్:** తన రాజకీయ జీవితంలో ఎక్కడా తలదించుకునే విధంగా వ్యవహరించలేదని.. భవిష్యత్‌లోనూ అలాగే కొనసాగుతానని, కుల గౌరవాన్ని కాపాడతానని రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ స్పష్టం చేశారు. ఆదివారం కరీంనగర్‌లోని వి కన్వెన్షన్ హాల్‌లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా గౌడ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళన సన్మాన కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. పెద్ద ఎత్తున తరలివచ్చిన సంఘాల ప్రతినిధులు పొన్నం ప్రభాకర్‌ను ఘనంగా సన్మానించారు.

ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ బలహీన వర్గాల సంక్షేమ శాఖ మంత్రిగా ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. గౌడ కుల సంఘాలన్నీ తనను ఆశీర్వదించాలని కోరారు. అందరికీ అందుబాటులో ఉంటూ కుల గౌరవం కాపాడుతానని హామి ఇచ్చారు. రాజకీయంగా ఎవరైనా తనపై అకారణంగా విమర్శలు చేస్తే సమాధానం చెప్పాల్సిన బాధ్యత సంఘ నేతలపై ఉందని సూచించారు. సంఘం కొరకు అందరూ ఐక్యంగా ముందుకు వెళ్ళాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పలువురు సంఘ నేతలు మాట్లాడుతూ పొన్నం ప్రభాకర్‌ను అభినందనల్లో ముంచెత్తారు. ఉమ్మడి రాష్ట్రంలో మార్క్‌ఫెడ్ చైర్మన్‌గా పార్లమెంట్ సభ్యునిగా 42 మంది పార్లమెంట్ సభ్యులకు కన్వీనర్ గా వ్యవహరించి అనేక పదవులను అలంకరించి కరీంనగర్ లో పాస్‌పోర్ట్ కేంద్ర కార్యాలయం, ఎఫ్ఎం రేడియో స్టేషన్, కేంద్రీయ విద్యాలయం రైల్వే లైన్ పునరుద్ధరణ పనులు తిరుపతికి ప్రత్యేక రైలు, కరీంనగర్లో సిటీ బస్సులు తీసుకువచ్చిన నేత ప్రభాకర్ అన్నారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రమంత్రిగా ఆర్టీసీని ముందుకు తీసుకెళ్ళుటకు కృషి చేస్తున్నారని అన్నారు. ఆర్టీసీ కార్మికుల పక్షాన నిలబడతారని, బీసీల సంక్షేమ పథకాలు ప్రతి పేద బీసీకి అందేలా పొన్నం ప్రభాకర్ చొరవచూపుతారని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కోడూరి సత్యనారాయణ గౌడ్, పడాల స్వామి, మంద రమేష్, పొన్నం సత్యనారాయణ గౌడ్, ఎస్వీ గ్రూప్ ప్రతినిధులు కాసారపు వేణు, బూస రామక్రిష్ణాగౌడ్, మాజీ కార్పొరేటర్ కోడూరి రవీందర్ గౌడ్, ఆదర్శ సత్యనారాయణ గౌడ్, మాచర్ల అంజన్న, మాచర్ల ప్రసాద్, కోడూరి రాజన్న,మద్దికుంట జగన్, సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు గోపగోని సారయ్య గౌడ్, కోట రవి, ముత్యం శంకర్ గౌడ్ , గౌడ రవి గౌడ్, శ్రీనివాస్ గౌడ్, శ్రీకాంత్ గౌడ్ కార్తిక్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.




# భూమేష్ కుటుంబానికి పది లక్షల ఎక్స్ గ్రేషియా ఇవ్వాలి

- మృతుడి భార్యకు ఉద్యోగం కల్పించాలి
- మాజీ ఎంపీ బోయినిపల్లి వినోద్ కుమార్

**వేములవాడ, ఎలగందల్ టైమ్స్:** గత పదేళ్ల కాలంలో ఎన్నడూ ఎండని బావులు, బోర్లలో భూగర్భజలాలు అడుగంటి పోవడంతోనే రైతులు బోరు బావుల్లో పైపులు దించుతున్నారని.... పొలాన్ని ఎలాగైన కాపాడుకోవాలని ఓ రైతు బోరు బావిలో కూలీలను పెట్టి పైపులు దింపిస్తున్న క్రమంలోనే బావుసాయి పేట కు చెందిన పంబాల భూమేష్ కరెంటు కాటుకు బలయ్యాడని... మరో ముగ్గురు బాధితులు పంబల రాజు, కర్ణాల శ్రీను, కర్ణాల మమేష్‌లు గాయపడ్డారని మాజీ ఎంపీ బోయినిపల్లి వినోద్ కుమార్ అన్నారు. కరెంటు షాక్‌కు గురై వేములవాడ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. సిరిసిల్ల ఏరియా ఆస్పత్రి మార్చురీలో పంబాల భూమేష్





మృతదేహాన్ని పరిశీలించి.. కుటుంబ సభ్యులను ఓదార్చారు.

ఈ సందర్భంగా మాజీ ఎంపీ మాట్లాడుతూ గత పదేళ్ల కాలంలో ఎన్నడూ కూడా చెరువులు, కుంటలు ఎండలేదని రైతులకు పుష్కలంగా నీళ్లు ఉండేవని... కాంగ్రెస్ ప్రభుత్వం మేడిగడ్డ బ్యారేజ్ పిల్లర్లు కుంగినాయనే సాకుతో నీళ్ల పంపింగ్ చేయకపోవడంతో భూగర్భజలాలు లేక రైతులు బోర్లలో పైపులు దింపితే నీళ్లు వస్తాయని ఇలా చేస్తున్నరని అన్నారు. ప్రభుత్వం వెంటనే మేడిగడ్డ బ్యారేజ్‌కు మరమ్మతులు చేసి గోదావరి జలాలను ఎత్తిపోయాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వం మృతుడు భూమేష్ కుటుంబానికి రూ. 10లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించడంతో పాటు మానవతా దృక్పథంతో మృతుడి భార్యకు ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# గుండ్లపల్లి-పొత్తూరు డబుల్ రోడ్డు నిర్మాణానికి అనుమతులు

**బెజ్జంకి, ఎలగందల్ టైమ్స్:** గుండ్లపల్లి నుండి పొత్తూరు వరకు 21 కిలోమీటర్ల మేర డబల్ రోడ్డు నిర్మాణానికి తెలంగాణ ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీనివాసరాజ్ మెమో నం. 857 ఆర్ఐఐ (1) 2024 తేదీ 05-03 -2024 ద్వారా అనుమతినిస్తూ ఉత్తర్వులు జారీ చేశారని గుండ్లపల్లి కాంగ్రెస్ నేతలు తెలిపారు. వారు ఆదివారం గుండ్లపల్లిలో విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికలకు ముందు మానకొండూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఇచ్చిన హామీ మేరకు డబుల్ రోడ్డు నిర్మాణం పనులను మంజూరి చేయించారని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో డబుల్ రోడ్డు నిర్మాణానికి ఎలాంటి అనుమతులు రాకుండానే ప్రజలను మభ్యపెట్టేందుకు శిలాఫలకాలతో, బైక్ ర్యాలీలతో, సన్మాన సభలతో ఆర్భాటాలు చేశారని వారు ఎద్దేవా చేశారు. డబుల్ రోడ్డు నిర్మాణానికి సహకరించిన ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో గుండ్లపల్లి కాంగ్రెస్ నేతలు బేతల్లి రాజేందర్ రెడ్డి, వంగల సత్యనారాయణ రెడ్డి, చాడ తిరుపతిరెడ్డి, చింతల పర్శరాములు, కాల్వ పెద్ద కొమురయ్య, వంగల రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

EDITOR,PRINTER,PUBLISHER AND OWNED BY VONTELA KRISHNA, PRINTED AT M/S SAI VEERANJANEYA PRINTERS HNO.8-1-109,KATTARAMPUR,TOWN, MANDAL AND DIST KARIMNAGAR-505001.TELANGANA STATE.
PUBLISHED AT HNO.5-6-416/1,KAPUWADA,MARUTHINAGAR, KARIMNAGAR-505001.TELANGANA STATE. EDITOR: VONTELA KRISHNA.9849731222, EMAIL:KRISHNA.VONTELA@GMAIL.COM